
ప్రజాశక్తి
సోమవారం 11 డిసెంబర్ 2023



సవరభాషా వాలంటీర్లకు జీతాలు చెల్లించాలి

యుటిఎఫ్

ప్రజాశక్తి-పార్వతీపురం

పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ పరిధిలో పనిచేస్తున్న సవరభాషా వాలంటీర్లకు బకాయి పడిన జీతాలు వెంటనే చెల్లించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి టి.రమేష్, ఎస్.మురళీమోహన రావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆగస్టు నెల నుండి వీరు పని చేస్తున్నారని, రెండు ఐటిడిఎల్లో 326 మందికి జీతాలు అందలేదని తెలిపారు. మిగిలిన ఐటిడిఎలలో జీతాలు చెల్లించినా ఇక్కడ జాప్యం చేస్తున్నారని చెప్పారు. అకౌంట్ ప్రారంభంలో సమస్యలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారని, వెంటనే సమస్యను పరిష్కరించి రెండు రోజుల్లో జీతాలు చెల్లించాలని కోరారు.

నీటిలోనే ఉన్న వరికుప్పలు



ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో చేతికి అందివచ్చిన వరి పంట నీటిపాలు కావడంతో రైతుల ముఖాల్లో దైన్యం కనిపిస్తోంది. మరో నెల రోజుల్లో వస్తున్న సంక్రాంతి పండుగ అవసరాల కోసం ధాన్యం డబ్బులు ఉపయోగపడతాయనుకున్న అన్నదాతల ఆశలు అడియాశలయ్యే దుస్థితి దాపురిస్తోంది. మిచౌంగ్ తుపాను కారణంగా కురిసిన భారీవర్షాలకు వరిపంట నీట మునిగిపోవడంతో కోలుకోలేని రీతిలో రైతులు నష్టపోయే అవకాశం ఉంది. దీంతో తాము వరి పంట సాగు కోసం చేసిన ఖర్చులు కూడా చేతికి రావేమోనన్న ఆందోళన వారిలో వ్యక్తమవుతోంది.

చి'వరి'కి నిరాశేనా?

- రంగుమారిన ధాన్యం
- కొనుగోలు నిబంధనల మార్పు అనుమానమే
- పెట్టుబడి కూడా రాదనే ఆందోళన
- రైతుల ముఖాల్లో దైన్యం

ప్రజాశక్తి-సాలూరు

తుపాను ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లా వ్యాప్తంగా వరిపంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. కోత కోసిన వరిచేను, పొలాలు, కళ్లాల్లో వేసిన వరికుప్పలు వరదనీటిలో మునిగిపోయాయి. కోయకుండా వదిలేసిన వరిపంటంతా నేలపాలైంది. ప్రస్తుతం తడిసిన వరి పంటను కోత కోయడం నుంచి ఒడ్డుకి చేర్చి ఆరబెట్టి మట్టింపు చేసేవరకు రైతులకు ఖర్చు తడిసి మోపెడవుతోంది. ఇప్పటికే ఎకరాల భూమిలో వరి పంట సాగు కోసం రూ.25 వేల వరకు ఖర్చయింది. ఇప్పుడు అదనంగా వరి చేలు వర్షాలకు తడిసిపోవడంతో అదనంగా మరో పదివేల రూపాయల వరకు ఖర్చు కనిపిస్తోంది. దీంతో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. తుపాను ప్రభావం లేకపోతే పెట్టిన మదుపులకైనా ధాన్యం డబ్బులు వస్తాయని ఆశించారు. కానీ రెట్టింపు ఖర్చు కావడంతో పెట్టుబడి పెట్టిన డబ్బులు కూడా రావని ఆందోళన చెందుతున్నారు.

నిబంధనల సడలింపుపై అనుమానాలు

తడిసిన, మొలకెత్తిన ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం నిబంధనలు సడలించాలనే డిమాండ్ తెరపైకి వస్తోంది. కొద్దిరోజుల క్రితం కురిసిన వర్షాలకు వరిపంట తడిసి పోయింది. కోత కోయని వరి చేలు నీటిలో మునిగిపోయాయి. మడుల్లో దిబ్బలు వేసినప్పటికీ ధాన్యం రంగు మారే అవకాశం ఉంది. నీటిలో ఎక్కువ రోజులు వరిచేలు నాని ఉండడంతో కొన్ని చోట్ల గింజలు మొలకెత్తాయి. మూడు రకాల ధాన్యాన్ని ప్రభుత్వం ఏయే ధరలకు కొనుగోలు చేస్తుందో అంతుచిక్కడం లేదు. మూడు రకాల ధాన్యం శాంపిల్స్‌ని ప్రయోగశాలకు పంపించిన తర్వాత వాటిని ఏయే ధరలకు కొనుగోలు చేయవచ్చునో ప్రభుత్వం నిర్ణయిస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో వరి మద్దతుధర క్వింటాకు రూ.2183గా ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ధాన్యం నాణ్యత ఉంటే ఆ ధరకు కొనుగోలు చేసే అవకాశం ఉంది. కానీ రంగు మారడం, తేమశాతం ఎక్కువగా ఉండడం, మొలకెత్తడం వంటి కారణాల రీత్యా ధాన్యం ధర తగ్గిపోయే పరిస్థితి కనిపిస్తోంది. దీంతో చేసిన ఖర్చులు కూడా చేతికి రావేమోనన్న ఆందోళనలో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అప్పులు చేసి పెట్టిన మదుపులు కూడా రాకపోతే చివరికి మిగిలింది ఏమీ ఉండదని కుంగిపోతున్నారు.

ధాన్యం శాంపిల్స్ పంపిస్తాం

ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న వరి పంట శాంపిల్స్‌ని ప్రయోగశాలకు పంపిస్తాం. తడిసిన ధాన్యం, రంగు మారిన ధాన్యం, మొలకెత్తిన ధాన్యం శాంపిల్స్ పంపించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ మేరకు పంపిస్తాం. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు కొనుగోలు చేపడతారు.

- అనురాధ పాండా, ఎఒ, సాలూరు



నూర్పిడి చేస్తున్న రైతులు

17న జిల్లా అభివృద్ధి సదస్సు

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

పార్వతీపురం మన్యం జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం చేపట్టాల్సిన కార్యాచరణ గురించి ఈ నెల 17న సదస్సు నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు తెలిపారు. ఈ మేరకు ఆదివారం పార్వతీపురం మండలం రావికోన పంచాయతీ పరిధిలో కొత్తవలస గ్రామంలో సదస్సు వాల్‌పోస్టర్‌ను సర్పంచ్ కె.రామస్వామితో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ సదస్సుకు రాజకీయ పార్టీల నాయకులు, రైతులు, అన్ని వర్గాల ప్రజలు హాజరుకావాలని కోరారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని వెనకబడిన ప్రాంతంగా ఉన్న మన్యం జిల్లా సమగ్ర అభివృద్ధి చెందాలంటే జంఝావతి ప్రాజెక్టు పూర్తి చేయాలన్నారు. వైద్య పరంగా సేవలు అందుబాటులోకి రావాలంటే మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలని డిమాండ్‌చేశారు. ఈ ప్రాంతంలో యూనివర్సిటీ, కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు లక్ష్మణరావు, బొండపల్లి చంద్రయ్య, కె.మోహనరావు, కొండతామర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



గిరిజనులను ఉద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

కళలను ఆదరించాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

కళలను, కళాకారులను ఆదరించి తగు ప్రోత్సాహాన్ని అందించాలని ప్రముఖ రచయిత గంటేడ గౌరినాయుడు అన్నారు. ఆదివారం పార్వతీపురం లయన్స్ కళ్యాణ మండపంలో కల్పన కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర చిత్రకళా ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ అనేక కళలకు, సాహిత్యానికి వేదిక పార్వతీపురం అన్నారు. కళలను బతికించుకోవాలని, పార్వతీపురం ప్రాంత ప్రజలు కాపాడుకోవాలని అన్నారు. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న కల్పన కల్చరల్ సొసైటీ వ్యవస్థాకులు హేమంత్ కుమార్‌ను అభినందించారు. ఇటువంటి కార్యక్రమాలు ఎన్నో జరగాలని, దానివల్ల జిల్లాలో ఉన్న కళాకారుల ఉనికి ప్రపంచానికి తెలియజేయడమే కాకుండా, కళాకారులందరూ ఏకతాటిపై తీసుకురావచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్రదర్శించిన చిత్రకళలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కల్పన కల్చరల్ సొసైటీ రజతోత్సవ పుస్తకాన్ని డాక్టర్ జయరాజ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ జయరాజ్, శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ చలపతిరావు, విశ్రాంత ఆచార్యులు పిల్లా సత్యనారాయణ, వేమకోటి నరహర శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు, మేధావులు

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-పార్వతీపురం

104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి వై.మన్మథరావు, 104 ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి సిహెచ్.ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.ఆనంద రావు అధ్యక్షతన స్థానిక సుందరయ్య భవనంలో ఆదివారం సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 104 ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. 104 వాహన సేవలు గతంలో మాదిరి రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలని డిమాండ్‌చేశారు. జిఒ 4459 ప్రకారం పిఎఫ్, ఇఎస్ఐ సక్రమంగా అమలు చేయాలన్నారు. యాజమాన్యం చెల్లించాల్సిన ఎంప్లాయిర్ కంట్రిబ్యూషన్ అరబిందో యాజమాన్యమే ఇవ్వాలని కోరారు. 104లో పనిచేస్తున్న డిఇఒలకు వెయిటేజ్ మార్కులు కల్పించి ప్రభుత్వ నియామకాల్లో ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్‌చేశారు. అక్రమ బదిలీలు, తొలగింపులు చేసిన ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో 104 ఉద్యోగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న 104 ఉద్యోగుల సంఘం నాయకులు

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మున్సిపాలిటీలోని బంగారమ్మ కాలనీలో చేపడుతున్న సిసి రోడ్డు పనులను ఆదివారం ఎమ్మెల్యే అలజంగి జోగారావు పరిశీలించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వార్డు ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చిన సమస్యల పరిష్కారానికి ఆయన చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా బంగారమ్మ కాలనీలో రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, సీనియర్ నాయకులు గోళ్ళ పద్మ, వెంకటరమణ, సచివాలయ కన్వీనరు మరడాన తవిటి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పప్పుచారూ కరువే!

నాలుగు నెలలుగా రేషన్‌లో కందిపప్పు దూరం

మార్కెట్లో నిత్యావసర సరుకుల ధరలు మండిపోతున్నా.. పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపశమనం కలిగించే చర్యలు అధికారులు, ప్రభుత్వం తీసుకోవడం లేదు. తెల్లకార్డుదారులకు రాయితీపై అందించే కందిపప్పు గత నాలుగు నెలలుగా పూర్తిగా నిలిచిపోయింది. రాష్ట్రవ్యాప్తంగా కందిపప్పు సరఫరా నిలిచిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో క్షేత్రస్థాయిలో సామాన్యులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. నాలుగు నెలలకు సంబంధించి కందిపప్పు నేటికీ సరఫరా కాలేదు. రాయితీపై నాలుగు నెలల సరకు అందుతుందని కార్డుదారులు ఎదురుచూశారు. కానీ సెప్టెంబర్ ఒకటి నుంచి పేదలకు అందించే రేషన్ సరకుల్లో కందిపప్పు లేదని అధికారులే చెబుతున్నారు. దీంతో పేదలు పప్పు బువ్వకు కూడా నోచుకోక పచ్చళ్లతో కాలం గడపవలసి వస్తుందని కంటనీరు పెడుతున్నారు.

ప్రజాశక్తి - కురుపాం

అసలే కూరగాయలు, నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పేద, మధ్య తరగతి ప్రజలు జీవనం సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం రాయితీపై అందించే సరకుల కోసం ఆశతో ఎదురుచూస్తున్న లబ్దిదారులకు నిరాశే మిగులుతోంది. దీనికి తోడు ప్రభుత్వం పేదలకు అందించాల్సిన రేషన్ సరకుల్లో ఒక్కొక్కటిగా తగ్గిస్తోంది. నాలుగు నెలలుగా కందిపప్పు పంపిణీ చేయలేదు. ఈ నెలలో కూడా కందిపప్పు ఇవ్వడం లేదు. కార్డుదారులకు బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ చేస్తున్నారు.

మండల మొత్తంగా 11 ఎండియు వాహనాలున్నాయి. వీటి పరిధిలో 14360 (కొత్త కార్డులతో కలిపి) బియ్యం కార్డులు న్నాయి. ఆయా కుటుంబాలకు ప్రతినెలా బియ్యంతోపాటు అరకిలో పంచదార, కిలో కందిపప్పును ప్రభుత్వం రాయితీపై అందించాల్సి ఉంది. ప్రతినెలా కందిపప్పు పంపిణీ చేయాల్సి ఉంది. రాయితీపై ప్రతి కార్డుకు రూ.67 చొప్పున అందించేది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో దీని ధర రకాన్ని బట్టి రూ.130 నుంచి రూ.180 వరకు ఉంది. నాలుగు నెలల నుంచి కందిపప్పు సరఫరా చేయడం లేదు. రెండు నెలలుగా 50 శాతం ప్రభుత్వం ఇస్తున్నప్పటికీ అది కూడా కొంతమందికే అందుతోంది.





రేషన్ పంపిణీ వాహనం వద్ద లబ్ధిదారులు ; కందిపప్పు (ఇన్‌సెట్‌లో)

పప్పును మరిచిపోయాం

గతంలో ప్రతినెలా కందిపప్పు పంపిణీ చేసేవారు. దీంతో వారంలో రెండు రోజులైనా పప్పుచారు చేసుకునేటోళ్లం. తీరా నాలుగు నెలల నుంచి కందిపప్పు పంపిణీ చేయడమే ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో పప్పుచారు చేసుకోవడమే మానుకున్నాం.

-ఎం. శ్రీనివాస్, బొడ్లగూడ

బయట కొనలేకపోతున్నాం

రేషన్ షాపుల్లో రూ.67కు కిలో కందిపప్పు సరఫరా చేసేవాళ్లు. ప్రస్తుతం సరఫరా నిలిపివేయడంతో కందిపప్పు ధర బయట మార్కెట్లో రూ.160 వరకు పలుకుతోంది. అసలే పనులు లేక ఇబ్బందులు పడుతున్న పేదలు అంత ధర పెట్టి కందిపప్పు కొనుగోలు చేయడం కష్టంగా మారుతోంది.

- టి.శంకరరావు, పెదగొత్తిలి

ప్రభుత్వం నుంచి వస్తే పంపిణీ చేస్తాం

ప్రభుత్వం నుంచి కందిపప్పు నాలుగు నెలలు పూర్తిగా సరఫరా కాలేదు. గత రెండు నెలలుగా 50 శాతం వస్తుండడంతో కొంతమంది కార్డుదారులకు పంపిణీ చేస్తున్నాం. అంగన్వాడీ కేంద్రాలకు మాత్రం సరఫరా వస్తుంది. ప్రభుత్వం నుంచి కందిపప్పు సరఫరా వచ్చిన వెంటనే లబ్దిదారులకు అందిస్తాం.

- ఎ.సాంబమూర్తి, సివిల్ సప్లై డిటి, కురుపాం

వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి - కురుపాం

టొంపలపాడు ఆశ్రమ పాఠశాల వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్ఎఫ్ఐ బృందం టొంపలపాడు ఆశ్రమ పాఠశాలను సందర్శించింది. అక్కడ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ టొంపలపాడు ఆశ్రమ పాఠశాలలో 42 మంది విద్యార్థుల పేర్లు నమోదైనా, ప్రతిరోజు 10 మందికే వంట వండుతున్నారని తెలిపారు. అది కూడా అరకొర సరుకులతో చాలీచాలని భోజనాన్ని అందిస్తూ, బియ్యం, గుడ్లు, పాల ప్యాకెట్లు అమ్మివేస్తున్నట్లు విద్యార్థులు తెలిపారని చెప్పారు. ఎక్కడికి తరలిస్తున్నారని విద్యార్థులు అడిగితే దుర్భాషలాడుతూ కొడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. మెనూ సక్రమంగా అమలు చేయడం లేదని చెప్పారు. నాచుపట్టిన ట్యాంకు నుండి వస్తున్న నీటినే వంటకి, స్నానానికి, తాగడానికి వాడటం వల్ల రోగాల బారిన పడుతున్నారని వాపోయారు. ఒకరోజు వండిన చింతచారును రెండు రోజుల వరకు వడ్డిస్తున్నారని, చాలా దుర్వాసన వస్తుందని తెలిపారు. వార్డెన్ ఎస్.వెంకటరావు అసలు పూర్తిగా ఉండడం లేదని, ప్రతి మూణ్నాలుగు రోజులకు సరిపడిన సరుకులు అందించి వెళ్ళిపోతున్నారని చెప్పారు. ఇంత దారుణంగా వార్డెన్ వ్యవహరిస్తున్నా ఐటిడిఎ అధికారులు చర్యలు తీసుకోకపోవడం చాలా అన్యాయమన్నారు. టొంపలపాడు ఆశ్రమ పాఠశాలను వెంటనే ఐటిడిఎ పిఒ, కలెక్టర్ సందర్శించి, వార్డెన్ ఎస్.వెంకటరావుపై కఠిన చర్యలు తీసుకొని సస్పెండ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు బి.అనీల్ పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి. రాజశేఖర్



విద్యార్థులకు పెడుతున్న ఆహారం

ఉద్యోగులకు జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి-సాలూరు

ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పదో తేదీ దాటినా ఇంతవరకు జీతాలు చెల్లించకపోవడం అన్యాయమని అన్నారు. ముఖ్యంగా చాలీచాలని జీతాలతో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూడా సకాలంలో జీతాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. ఉద్యోగులు కుటుంబాలను పోషించడానికి అప్పులపాలయ్యే పరిస్థితి కనిపిస్తోందని చెప్పారు. వెంటనే జీతాలు విడుదల చేయకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సిఐటియు నాయకులు బి.ఈశ్వరరావు, స్వప్న, రవి పాల్గొన్నారు.

నేటి నుంచి సచివాలయ సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని 17 సచివాలయాల సిబ్బందికి, వాలంటీర్లకు విధివిధానాలు, పనితీరు మెరుగు పరుచుకొనుట అనే అంశాలపై సోమవారం నుండి 16 తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపిడిఒ సూర్యనారాయణ తెలిపారు ఈ కార్యక్రమానికి వాలంటీర్లు, అన్ని సచివాలయాల ఉద్యోగులు విధిగా వారి షెడ్యూల్ ప్రకారం హాజరు కావాలని సూచించారు. ఎవరైనా గైర్హాజరైతే నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.



డిప్యూటీ సిఎంకు వినతి అందిస్తున్న ఎజెఎసి నాయకులు

డిప్యూటీ సిఎంని కలిసిన ఎజెఎసి నాయకులు

ప్రజాశక్తి-సాలూరు

డిప్యూటీ సిఎం రాజన్నదొరని ఆదివారం ఎపి ఆదివాసీ జెఎసి నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. రాజన్నదొర క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆదివాసీ జెఎసి అల్లూరి సీతారామరాజు జిల్లా కన్వీనర్ రామారావు దొర, పార్వతీపురం మన్యం జిల్లా వైస్ చైర్మన్ కొండగొర్రి ఉదయ్ కుమార్ ఆధ్వర్యాన నాయకులు కలిసి సమస్యలు వివరించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 244(1) పేరా 5(1),(2) ప్రకారం షెడ్యూల్ ఏరియాలో ఉద్యోగ నియామకాల రెగ్యులేషన్ రూపొందించడానికి గిరిజన సలహా మండలిలో తీర్మానం చేయాలని కోరారు. దీనిపై డిప్యూటీ సిఎం రాజన్నదొర మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి ఈ విషయం తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు జయసింహా, సుబ్బు , నిమ్మక అన్నారావు ఉన్నారు.


దాలినాయుడుకు నియామకపత్రం అందిస్తున్న రాష్ట్ర ప్రతినిధులు

ఎన్‌హెచ్‌ఆర్‌సి జిల్లా అధ్యక్షులుగా దాలినాయుడు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులుగా వంగల దాలి నాయుడు నియమితులయ్యారు. విశాఖపట్నం ప్రేమ సమాజంలో ఆదివారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవంలో భాగంగా జాతీయ మానవ హక్కుల కమిటీ రాష్ట్ర అధ్యక్షులు కదిరి రాము ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా దాలినాయుడును జిల్లా అధ్యక్షులుగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ మానవ హక్కుల కమిటీ తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానన్నారు. పోరాటంతోనే హక్కుల సాధన సాధ్యమన్నారు. మానవ హక్కులపై ప్రజలు, యువత, మహిళలు, విద్యార్థులను చైతన్యం చేస్తానన్నారు.

ప్రభుత్వానికి పంట నష్టం కనిపించలేదా?

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ప్రభుత్వానికి పంట నష్టం కనిపించడం లేదా? అని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కడ్రక మల్లేశ్వర రావు ఒక ప్రకటనలో ప్రశ్నించారు. తుపాను వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. కురుపాం ఎమ్మెల్యే కోటకే పరిమితం అయ్యారని, రైతుల ఓట్లు కావాలి కానీ వారి సమస్యలు అవసరం లేదా? అని ప్రశ్నించారు. నియోజకవర్గంలో కరువు కనపడలేదా? అని నిలదీశారు.

సవరభాషా వాలంటీర్లకు అందని వేతనాలు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఐదు నెలలుగా సవరభాషా వాలంటీర్లకు గౌరవ వేతనం అందలేదని ఆ సంఘం పార్వతీపురం మన్యం జిల్లా ఉపాధ్యక్షులు బి.భీమారావు తెలిపారు. ఆగస్టు నుంచి డిసెంబర్ వరకు వేతనాలు ఇవ్వలేదని చెప్పారు. పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో 176, సీతంపేట ఐటిడిఎ పరిధిలో 155 సవర మాతృభాషా పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. ఐటిడిఎ అధికారులు స్పందించి వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఈ నెల 14న ధర్నా చేస్తామని హెచ్చరించారు.


ప్రచారం చేస్తున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జయకృష్ణ

గిరిజన గ్రామాల్లో భవిష్యత్తుకు గ్యారెంటీ

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలోని కిల్లాడ పంచాయతీ పరిధిలో జగ్గడగూడ, అప్పన్నగూడ, చింతమానుగూడ, డంజుపాయి, కిల్లాడ గ్రామాల్లో ఆదివారం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యాన బాబు షూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జయకృష్ణ మాట్లాడుతూ మినీ మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ అంశాలను వివరించారు. మళ్లీ చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్ర పరిస్థితులను అధ్యయనం చేస్తున్న ఏకైక వ్యక్తి చంద్రబాబని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి ఆరిక సువర్ణ, భవిష్యత్తు గ్యారెంటీ ప్రచారకర్త తోయిక సంధ్యారాణి, సవర సోడంగి, ఆరిక ఆనంద్, నాయకులు బిడ్డిక ప్రవీణ్ సాయి, మూటక భరత్ రాజ్, ఆరిక వరలక్ష్మి, పాలక శంకర్, ఆరిక మణిబాబు, ఊయక నగేష్ కుమార్ పాల్గొన్నారు.


సిఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

ముఖ్యమంత్రి సహాయ నిధి అందజేత

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణంలోని నాలుగో వార్డుకు చెందిన పంటల శ్రీనివాస్ నడుముకు శస్త్ర చికిత్స చేసుకుని ఆర్థికంగా చితికిపోయారు. ఆ కుటుంబానికి సిఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, వార్డు కౌన్సిలర్లు కోరాడ శ్రీనివాసరావు (నాని), ఎస్.లావణ్య పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపిడిఒ గీతాంజలి

పెద్దూరు, సీతంపేటలో వికసిత్ భారత్

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో సీతంపేట, పెద్దూరులో ఆదివారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఒ కె.గీతాంజలి జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఐసిడిఎస్ పిఒ పి.రంగలక్ష్మి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందించిన పౌష్టికాహారం గురించి వివరించారు. పౌష్టికాహారం స్టాళ్లు ఏర్పాటుచేశారు. వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కళావతి, ఆదిలక్ష్మి, ఇఒపిఆర్‌డి కొండపల్లి సత్యం, కార్యదర్శి సుదర్శన్‌రావు, శివ, తదితరులు పాల్గొన్నారు.

19న గ్రామీణ వైద్యుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఈనెల 19న గ్రామీణ వైద్యులు ఆత్మీయ కలయిక డి-మార్టు ఎదురుగా గల సర్వరాయ విహార్‌లో జరగుతుందని ఆ సంఘంజిల్లా అధ్యక్షులు గెద్ద చిరంజీవి తెలిపారు. ఆదివారం స్థానిక పిఎస్ఆర్ కాంప్లెక్స్ గ్రామీణ వైద్యుల సంఘం కార్యాలయంలో కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మీయ కలయిక లో జిల్లాలో సామాజిక సేవా కార్యక్రమాలు చేసిన వారిని గుర్తించి పురస్కారాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జోనల్ గౌరవ అధ్యక్షులు మమ్ముల తిరుపతిరావు, జిల్లా కార్యదర్శి కోట్ల పైడిరాజు, కోశాధికారి ఉమా శంకర్, సహాయ కార్యదర్శి మక్కువ రమణ, ఉపాధ్యక్షులు రామ్మూర్తి రాజు, సమాచార కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.


దాతలే ఆధారం

రంగులకు నోచుకోని మండల వనరుల కేంద్రం

ప్రజాశక్తి -గరుగుబిల్లి

ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమం పేరుతో పలు విడతలుగా పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపడుతున్న విషయం తెలిసిందే. నాడు-నేడు కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారులకు ఎంఆర్‌సి గురించి పట్టడం లేదు. పాఠశాలలకు రూ.లక్షల్లో నిధులు కేటాయించి, అభివృద్ధి చేసి, సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. కానీ మండలంలో పాఠశాలలన్నింటికీ కేంద్రంగా ఉంటూ, ఎంఇఒ విధులు నిర్వర్తించే భవనానికి రంగుల కోసం దాతలపై ఆధారపడటం గమనార్హం. ప్రతి ఏటా వస్తున్న నిధులు ఏమవుతున్నాయో అర్థం కావడం లేదు. దాతల సహాయంతో మరమ్మతులు చేయడం తప్ప గడిచిన నాలుగేళ్లలో ఎక్కడా మండల కేంద్రానికి వచ్చిన నిధులు వినియోగించలేదు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి మండల కేంద్రానికి వచ్చిన నిధులు

మండల వనరుల కేంద్రానికి నాలుగేళ్ల క్రితం దాతల సహాయంతో రంగులేశారు. అప్పటి నుండి ఇప్పటివరకు మండల వనరుల కేంద్రానికి మెరుగులు దిద్దిన దాఖలాలు లేవు. మరమ్మతులకూ దాతలే దిక్కు. నిధుల వినియోగంపై ఉన్నతాధికారుల పరిశీలన ఏమవుతుందో, ఎందుకు ఈ విషయం పట్టించుకోవడం లేదో ఆలోచించాల్సిన విషయమేనని విద్యార్థుల తల్లిదండ్రులు, మేధావులు గుసగుసలాడుతున్నారు. ప్రతి ఏటా వస్తున్న వేల రూపాయల నిధులు ఎటు పోతున్నాయో సంబంధిత అధికారులకే తెలియాలి.



ఏమయ్యాయో పరిశీలన చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని విద్యార్థులు తల్లిదండ్రులు, మేధావులు కోరుతున్నారు.

అధ్వాన స్థితిలో ఉన్న కేంద్రాలు

ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఉన్న 34 మండల వనరుల కేంద్రాలు అధ్వాన స్థితిలో ఉన్నాయి. సిబ్బంది విధులు నిర్వహించేందుకు అననుకూలంగా ఉన్నాయని పలువురు ఉపాధ్యాయులు గుసగుసలాడుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన నిధులు ఎటూ సరిపోక నానా ఇబ్బందులు పడుతున్నామని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం అంతంతమాత్రమేనని పలువురు అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రంగులేసిన దాతల బోర్డు ; ఎంఆర్‌సి కార్యాలయం

ఎంఆర్‌సిలను ఆధునీకరించాలి

ఉపాధ్యాయులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న మండల వనరుల కేంద్రంలో మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం పద్ధతి కాదు. విద్యా రంగంలో వస్తున్న నూతన మార్పులకు అనుగుణంగా నిరంతరం శిక్షణ కల్పించేందుకు ఉపయోగించే ఈ వనరుల కేంద్రాన్ని ఆధునీకరించాలి. మౌలిక వసతులు కల్పించాలి.

- బి.వి.రమణ, సిపిఎం నాయకులు

సమస్యలతో సహజీవనం

అభివృద్ధికి దూరంగా దిగువసప్పగూడ


అభివృద్ధి జాడ లేని దిగువ సప్పగూడ గ్రామం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మండలంలోని పెద్దఖర్జ పంచాయతీ దిగువసప్పగూడ గిరిజన గ్రామం అభివృద్ధికి దూరంగా ఉంది. గ్రామం ఏర్పడి 40 ఏళ్లు దాటినా కనీస మౌలిక వసతులు లేవు. తాగేందుకు నీరు లేక, పక్కా గృహాలు మంజూరు కాక గిరిజనులు అవస్థలు పడుతూ జీవనం సాగిస్తున్నారు.

దిగువసప్పగూడ గ్రామంలో 14 కుటుంబాలుండగా, 120 మంది వరకు జనాభా ఉన్నారు. గ్రామంలో బోర్లు లేకపోవడంతో కొండవాగు చెలమలు, బావి నీటిపై ఆధారపడి జీవిస్తున్నారు. ప్రతి ఏడాది వేసవి కాలం వచ్చిందంటే వాగు నీరు పూర్తిగా ఇంకిపోతుంది. ఉన్న బావి నీరు కూడా అడుగంటిపోతోంది. దీంతో ఏటా వేసవిలో నీటి సమస్య తప్పడం లేదని గ్రామస్తుడు భీమారావు ఆవేదన వ్యక్తంచేశారు. పక్కా గృహాలు లేకపోవడంతో శిథిలమైన రేకిళ్లలోనే తలదాచుకుంటున్నారు. టిడిపి హయాంలో రెండు పక్కా ఇళ్లు మాత్రమే నిర్మాణం చేపట్టారు. గ్రామ వాలంటీర్ వచ్చి పక్కా గృహాలు మంజూరు అయ్యాయని చెప్పడంతో ఉన్న ఇళ్లను విరగ్గొట్టారు. ఇళ్ల నిర్మాణాల కోసం అధికారులను అడగ్గా, 'మీకు ఎవరు కట్టుకోమన్నార'ని అనడంతో ఏం చేయాలో తెలీక ఉండి పోయామని గిరిజనులు మండంగి నీలకంఠం, బిడ్డిక మన్మథరావు, టి.తౌడు, ఎం.దానిమ్మ వాపోయారు. ఉపాధి లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని, ఐటిడిఎ ద్వారా ట్రైకార్ రుణాలు మంజూరు చేయాలని కోరుతున్నారు. గ్రామంపై ఐటిడిఎ అధికారుల దృష్టిసారించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.


పక్కా ఇళ్ల కోసం ఉన్న ఇళ్లను కూల్చిన గిరిజనులు



ఫీడర్ అంబులెన్స్ డ్రైవర్‌తో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

ఫీడర్ అంబులెన్స్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-పాచిపెంట

ఫీడర్ అంబులెన్స్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం చేయాలని సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు అభిమన్యుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలో ఆదివారం వారు ఫీడర్ అంబులెన్స్ డ్రైవర్‌తో మాట్లాడి, సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు సేవలు అందించేందుకు ఫీడర్ అంబులెన్సులను ఏర్పాటు చేసిందన్నారు. జిల్లాలో 200 మందికి పైగా ఫీడర్ అంబులెన్స్ డ్రైవర్లు ఉన్నారని తెలిపారు. ఫీడర్ అంబులెన్స్ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అంబులెన్స్ మరమ్మతులకు గురైతే ప్రభుత్వమే బాగుచేయాలని కోరారు. మెరుగైన వేతనాలు చెల్లించి ఆదుకోవాలని డిమాండ్‌చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

ధాన్యం కొనుగోలుపై దృష్టిపెట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి వెంకటరమణ నాయుడు

ప్రజాశక్తి-వీరఘట్టం

ధాన్యం కొనుగోలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు అధికారులను ఆదేశించారు. ఆదివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా ధాన్యం కొనుగోలుపై రైతులు ఎటువంటి ఇబ్బందులూ కలగనివ్వొద్దన్నారు. ఇటీవల కాలంలో తుపాను ప్రభావం వల్ల ధాన్యం రంగు మారే పరిస్థితి ఉందని, వాటిని కూడా కొనుగోలు చేసేందుకు చొరవ చూపాలని కోరారు. రైతులు మోసపోకుండా ఉండేందుకు దళారుల నుండి విముక్తి కల్పించాలని అధికారులకు సూచించారు. ఎంత విస్తీర్ణంలో పంట నాశనమైందో వివరాలు నమోదు చేయాలన్నారు.

అనంతరం నర్సిపురం పంచాయతీ సర్పంచ్ కర్రి గోవిందరావు మాట్లాడుతూ గ్రామానికి జలజీవన్ మిషన్ పనులు చేయడం లేదని ప్రశ్నించారు. మూడో విడతలో చేపడతామని ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ పవన్ వివరణ ఇచ్చారు. విద్యుత్తు శాఖ ఎఇ బాలాజీ మాట్లాడుతుండగా, వీరఘట్టం-4 ఎంపిటిసి మంతిని హేమలత అడ్డుతగిలి, గత మండల సర్వసభ్య సమావేశంలో ప్రస్తావించిన సమస్యలు పరిష్కారం కాలేదని, ఏదైనా ప్రమాదం జరిగితే దానికి బాధ్యులు ఎవరని ప్రశ్నించారు. సమస్య పరిష్కరిస్తామని ఎఇ తెలిపారు. ఎంపిడిఒ వై.వెంకటరమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జెడ్‌పిటిసి జంపు కన్నతల్లి ఉమామహేశ్వరరావు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ కర్రి లీలాప్రసాద్, సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.


రావాడ కూడలి వద్ద వైసిపి జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపిపి శెట్టి పద్మావతి

మళ్లీ జగనే ఎందుకు కావాలి?

ప్రజాశక్తి - కురుపాం

కురుపాంలో ఆదివారం మళ్లీ జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. రావాడ కూడలి వద్ద ఎంపిపి శెట్టి పద్మావతి వైసిపి జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఒకటో సచివాలయం వద్ద ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి మళ్ళీ ఎందుకు సిఎం కావాలనే దాని గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జి.సుజాత, ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, జెడ్‌పిటిసి జి.సుజాత, జిల్లా కో ఆప్షన్ సభ్యులు షేక్ నిషార్, వైసిపి వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు, ఎంపిటిసిలు వి.బంగారు నాయుడు, టివిఎస్ స్వామియోజులు, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ జిలాని, మాజీ ఎఎంసి చైర్మన్ ఎన్.వెంకట్రావు పాల్గొన్నారు.

గిరిజనులకు కృష్ణమూర్తి ఆసరా

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న వృద్ధమిత్ర కోఆర్డినేటర్, హెడ్ కానిస్టేబుల్ కె.కృష్ణమూర్తి గిరిజనులకు ఆసరాగా నిలిచారు. ఆదివారం కొమరాడ మండలం పాలెం పంచాయతీ రావికోన గ్రామంలో 40 మంది మహిళలకు, వృద్ధులకు రగ్గులు, స్టీల్ గ్లాసులను పంపిణీ చేశారు. వీటిని గ్రామ నాయకులు పువ్వుల పత్తి, బిడ్డిక, వెంకట్రావు, పల్లా సురేష్, కిల్లక లక్ష్మి, తోయకి తింపలి సమక్షంలో అందజేశారు.


గిరిజనులకు రగ్గులు పంపిణీ చేస్తున్న హెచ్‌సి కృష్ణమూర్తి

50 మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి-సీతానగరం

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు శంకర్రావు 50 మందికి కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారిని కంటి శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సందడే సందడి

పర్యాటకులతో కిటకిటలాడిన పార్కు ● బారులు తీరిన వాహనాలు


సాహస గోడ ఎక్కుతున్న యువకుడు


బోటు షికారు చేస్తున్న యువత

ప్రజాశక్తి-సీతంపేట

కార్తీక మాసం ప్రారంభం కాగానే టక్కున గుర్తుకొచ్చేది సీతంపేటలోని ఐటిడిఎ అడ్వెంచర్ పార్కు. ఎందుకంటే చిన్నారులు, యువత, పెద్దలు.. ఇలా అందరినీ అలరిస్తుంది. అందుకు తగ్గ కార్యక్రమాలు అక్కడ ఉన్నాయి. పర్యాటక ప్రేమికులకు పార్కు ప్రత్యేకమైన అనుభూతిగా మారింది. సీతంపేట మన్యంలో పర్యాటక ప్రాంతాలకు కొదవలేదు. జగత్‌పల్లి రిసార్ట్స్, ఆడలి వ్యూ పాయింట్, సున్నపుగడ్డ, మెట్టుగూడ జలపాతాలు, మైమరిపించే ప్రకృతి అందాలు, పచ్చనిపొలాల సోయగాలు, ఒంపుసొంపులతో కనువిందు చేసే కొండలు.. ఇలా ఎన్నెన్నో పర్యాటక అందాలు మన్యం సొంతం. వాటికి అదనపు, ప్రత్యేక ఆకర్షణగా అడ్వెంచర్ పార్కు తోడైంది. వీటిని సందర్శించేందుకు ఆదివారం మన్యం జిల్లాతోపాటు శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి వేలాది మంది పర్యాటకులు తరలివచ్చారు. ప్రధానంగా ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్కుకు పర్యాటకులు పోటెత్తారు. ఆకాశంలో స్కై సైకిల్ తొక్కుతూ, జలవిహార్‌లో బోటు షికారు చేస్తూ, హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడుస్తూ యువత, చిన్నారుల సందడి చేశారు. చిన్నారులు మినీ ట్రైన్, మినీ బోటింగ్ చేసి, కమాండ్ నెట్ ఎక్కి సరదాగా ఆడుకున్నారు. ఆనంద విహార వద్ద యువత ఉల్లాసంగా డాన్సులు వేశారు. మరి కొంతమంది పర్యాటకులు సాహస విన్యాసాల్లో పాల్గొన్నారు. ఇలా ఎన్నెన్నో కార్యక్రమాలతో అడ్వెంచర్ పార్కు.. పర్యాటకులకు మరపురాని అనుభూతిని మిగిల్చింది.

అసలే కార్తీక మాసం. ఆపై ఆదివారం.. అది కూడా కార్తీకమాసం చివరి ఆదివారం. ఇంకేముంది! దారులన్నీ అడ్వెంచర్ పార్కువైపే. భారీగా తరలివచ్చిన పర్యాటకులతో సీతంపేటలోని ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్కు కిటకిటలాడింది. ఉద్యానవనమంతా సందడి సందడిగా మారింది.


స్కై సైకిల్ తొక్కుతున్న యువతి


మినీబోటింగ్ వద్ద చిన్నారుల సందడి


మెట్టుగూడ జలపాతం వద్ద పర్యాటకుల సందడి


మినీ ట్రైన్‌పై చిన్నారులు